# ఆగంతుకి

జనమంచి కామేశ్వరరావుగారు

అమావాస్యగడచింది. నిశాకాంత చుక్కపువ్వుల నీలిదోవతీకప్పుకుంది. ఆమె శిఖలో తురిమికున్న నెలవంక విదియనాటి అంధకారంలో పొడసూపింది. మెరపుసేపులో, నెలవంకనుపోలివున్న నానెచ్చెలిక్రిందిఅధరం, స్మృతికివచ్చింది నెలవంకకాసేపులో మాసిపోయిందికాని నానెచ్చెలిపెదవివంక, అల్లాగే నిల్చింది నామనోదృష్టిలో!

* * * *

ఆరోజులుతల్చుకుంటే అబ్బా! ఒళ్లు జల్లుమంటుంది. కళ్ళనీటితళతళలో చూపుమసకవుతుంది ఒకమోస్తరు వేదనాభారంతో శరీరం బరువెక్కుతుంది. అసలు బ్రతుకే శూన్యంగావుంది. దానిపైనఆదెబ్బ!-నెచ్చెలి మృత్యుగ్రస్తమవడం -సమస్తజగతి జడమూ శూన్యమూ అనిపించింది ఎంతోదట్టంగా పట్టింది, చీకటిముసురు, నన్ను. నల్లమందు చిదుపల్లాకొయ్యవచ్చును ఆఅంధకారాన్ని. అటువంటి కారు రాత్రిల్లో పుల్లచీమలు కుట్టినట్టయింది బ్రతుక్కి. హృదయంలో నొవ్వ పొడవగాపడ్డకష్టాలపుళ్ళన్నీ సలుపుపెట్టాయి. దానితోటి అదిబాధ ఆపుకోలేక దిందులు త్రొక్కింది.

* * * *

పరమేశ్వరుడు నాప్రేమనంతా ఆతనిలోనే నిక్షిప్తముచేశాడు. నా హృదయ మతన్నే కాని మరొకళ్ళనెరుగదు అతను గతించాడు. రసప్లావితమైన ప్రేమ రాగాలుతీసింది ఘనఘనవి రోదించింది భోరుభోరున గొల్లెత్తింది హృదయంలో నుగుసుల్లు త్రొక్కుచూ అశ్రుస్రవింతిక ప్రళయభీకరంగా పొంగి పొరలింది. ఆప్తులు, బంధువులూ వారి సాంత్వనభాషణములతో నావరదకట్టిపారునదికి, ఆనకట్ట వేయబోయినారు "ఛట్!" అని చీకాకుపడ్డాను వాళ్ళనుండి బైటబడ్డాను. ఒక్కవెలుగురేకైనా తొంగిచూడని చీకటింటిలోకూర్చుని వెక్కసపుమూల్గులతోదుఃఖాన్నిదునిమి చెండాడాను. "ఛా! యిదేమిటి!" అనుకున్నాను. నాప్రేమ మృత్యుదేవతచేసిన అపచారమునకు ఎదురొడ్డాలి కాని దానికి లొంగిపోయి అశ్రుఅభిషేకాలతో ప్రణయార్ద్రగీతాలతో ప్రియనామం రుద్రాక్షుల త్రిప్పుచూ పూజించడం కూడదనిపించింది.

లేచాను. తలుపులు దభేలున చప్పుడు చేస్తూ బార్లాతీసేశాను.

* * * *

ఏముఖంచూచినా మృత్యుఆరాధన చేస్తున్నట్లే కనబడింది. చేతనాచేతనాభేదం అపరిగ్రాహ్యమయింది అంతా సజీవమే! అంతా సమృత్యువే! క్షణక్షణమూ ఈవిశ్వమంతా ఆమహామృత్యుమూర్తి చెరగులోనికే యాత్రసాగిస్తూన్నట్టనిపించింది. ఏమిటి? నాప్రేమను లాక్కోవాలని యత్నించిన మృత్యువుకి నేను నాఅరుంతదవేదనామూల్య మణిహారం గళాంకితమివ్వాలా?

* * * *

మృత్యూ! నాహృదయమణిని మబ్బుల్లో దాచి మాయింపచేయ చూస్తావా? అది

తారలా తమస్వినీకుహారంలో కూడ మెరుస్తుందని తెలియదు కాబోలు! నీకు ధైర్యం లేదు. వట్టిపిరికిపందవి రాత్రే రావాలీ? పగలు రాకూడదూ? నా వెంకే పిల్లిఅడుగులు వేస్తూవచ్చి నేను కళ్ళుమూసుకొని నిద్రపోతున్నానో లేదో కనిపెట్టి అదను చూసుకుని నా ప్రేమను హరింపచూస్తావూ? ఓహో! నీదెంతటి ధైర్యం! ఎంతటిసాహసం!

ఓమృత్యూ! నీకేధైర్యముంటే నాఎదుట పడు. నాప్రేమమూర్తిని ఎత్తుకపోవడానికి వచ్చాననిచెప్పు!

అంతేకాని, నీకుకూడ ఎందుకీనైచ్య చౌర్యబుద్ధి? ప్రపంచంలో నీతిపరుల మనుకునే నీపూజకులైన ఈమానవోత్తములంతా పిత్రీల్లాంటి చోరీలకూ, టుంబ్రీల్లాంటి కూనీలకూ న్యాయస్థానాల స్థాపించి నేరాలమోపి తీర్పులు దిద్దడమెందుకు? నివు చేస్తూండే ఈచీకటిదోపిడిలతో పోలిస్తే ఆనేరాలన్నీ ఎంతటివి!

* * * *

ఈలోకాన్నంతనూ నీచీకటిగూడులోనే పెట్టుకొని కూడ, నీవు కారురాత్రికోనలనే నీస్వైరవిహారం సాగించాలీ? కాస్త వెలుగురేకలు విచ్చుతూన్నప్పుడు రావడానికి నీకెందుకంతభయం? నీనల్లకళ్ళల్లోకి ప్రేమవెలుగులు చొరనివ్వవు కాబోలు?. అవును! మాప్రేమకిరణాలు నీకళ్ళల్లోనికి ఒక్కసారి చొరనిచ్చావా వాటిలో పువ్వులేస్తాయి. అంత నువ్వు అంధురాలవై ఏమూలనో కూర్చోవాలి బకధ్యాన్నంచేస్తూ. అప్పుడు యింక నీకన్నం పోరదులే! మేమే నీయందు కనికరముంచి ఏదోయింత భుక్తికిపారెయ్యాలి.

* * * *

మృత్యూ! మృతకళేబరాలనే సుమీ నీవు చివరకు దొంగలాడేది! ఏదో గొప్పగా ప్రేమనూ ఆత్మలనూ హరిద్దామని వస్తావు, చివరకు జ్వాలాదందహ్యమానమైన మాఎముకలగూడు మసిముఖానికి పూసుకొని పోతావు. ప్రేమ నీముఖానికి మసే పూస్తుందిలే. అంతే నీయెడచూపేగౌరవం! అదే నీకిచ్చే ఉపహారం!

* * * *

ఎందుకు మృత్యూ! ప్రేమను నీసంచిలో ఇముడ్చుకున్నాననుకొని మనిషిని కూడ మాయింపచేయ చూస్తావు? నీసంచిలో యిమిడేదికాదు సుమీ ప్రేమ. సంచిబరువు మూసుకొని అదంతా దోపిడీ చేసుకొని వచ్చిన ప్రేమబరువని కులుకుతున్నావూ? అదంతా మా బ్రతుకుబరువేసుమీ!

ఎంతో భీకరాట్టహాసంచేస్తూ అకాలంలో దోపిడీలు కొట్టి గులకరాళ్ళ నాసంచికెత్తుకొని మూపుకాయలుకాయ మోసుకొని వచ్చావు?

గులకరాళ్ళకోసం రాత్రికన్నాలెందుకు? ఎప్పుడుపడితే అప్పుడేవాటిని ఏరుకోవచ్చునే? నీకు అడ్డుతవిలే వారెవరుంటారు? ఎన్ని మోసుకపోతే నిన్నెవరేమంటారు?

* * * *

మృత్యూ! నామాట విని నీఓటమి ఒప్పుకో! భువి వేకువజామునుండీ ప్రతిరేయీ

సాగిస్తూన్న నీయాత్రలవల్ల ఏమిసాధించావు? మృత్తికతప్ప! యుగయుగాలనుండీ దోపిడీ చేసి సంపాదించిన పుర్రెలూ ఎముకలగుట్టలూ బూడిదపోగులూ నీగుహలో చుట్టూపెట్టు కొని మృత్యుఘోష సల్పుకుంటూ కూర్చో!

* * * *

నీ కెదురుగానే మాఉజ్జ్వలమూర్తులు అమృతగళాల నెత్తి వైతరణీఝరీశ్రుతితో కలిపి ప్రేమోత్సాహగరిమతో నీనిష్ఫల చౌర్యానికి శిక్షగా మోహనగీతాలు పాడు తాయి. గానోర్ములత్రిజగత్తులనూ తేల్చు తూ నృత్యకేళి సల్పుతూంటాయి.

## కుక్కుటరోదనము

శ్రీమతి పట్టిసపు సీతమ్మగారు

రూపభేదంబె కాని వేరొండుగావు
ప్రాణములు నీకు నాకు నన్యాయముగను
కలహమునుగూర్చి మాకు కత్తులనుగట్టి
చంపనుంకించె దిది పౌరుషంబె? శూద్ర!
ఇలనుదొరికినయట్టి గింజలనుదినుచుఁ
బొట్టఁబోషించుకొను మమ్ము ఁబట్టఁబెట్టి
కపటివై పెంచుటది యిందుకా? రవంత
జాలియనుమాట నీకు లేదేల శూద్ర!
నావలన నీకు నెద్దియైనా యపకృతి
సుంతకలిగెడునా? అట్టిచో వధింప
తగుదు నుపకారమే చేయుదాన. వేళ
చెప్పి లేపుచునున్న దాసీను గాన?
ఈవు పొలమేగువేళ వీక్షించి రేయి
'కొక్కొరోకో'యటంచు మేల్కొల్పుచుందు
మొద్దునిద్దురలో మునిగిపోయియున్న
నిన్ను లేపుదు రెవరింక నన్ను చంప?
కటకటా! చాటునను చిట్టుగంపలోన
నొరులెరుఁగకుండ గ్రుడ్డుల నుంచుకొన్న
నెప్పుడో కన్నుమరపించి యిట్టివాని
తస్కరింతువు నీకేమి దాపరించె
కడుపునిండున కాలునిండెనన నాదు
చిన్నిగ్రుడ్లనుతినిన ఛీ! ఛీ! కిరాత.
నోరులేమి మీవలె నేడ్వ నేరగాని
గర్భశోకమిద్దరకు నొక్కటియెగాదె?
ఇంతమాత్ర మూహింప వదేమి నీకు
జ్ఞానమున్నట్టిఫలమిదేనా? కిరాత!
వత్సరాదిని' సంక్రాంతిపండువులను
వేడుకయటంచు మాకు కల్పించి పోరు
నోడిపోయితివంచు నీవుడికియుడికి
రెండుకాళులబిగదన్ని రెపరెపమని
కొట్టుకొనుచుండ పీకను బట్టినులిమి
పట్టిబలవంతముగ చంపివైతు వకట!
పాతకమటంచు భయమేది? ఘాతుకుండ!
గ్రామదేవతజాతరలందుబట్టి
బలియనుచు నొకయేటున జెలువశిరము
ప్రాణమెట్లొప్పునో చెప్ప రాదుగాని
మమ్ముజంప మీకోర్కె సంపన్నమగున?
నాఁడు పాణిని వ్యాకరణమ్ము చేయ
బూని మాదుకూతను మొట్టమొదటవినియు
దానినే హ్రస్వదీర్ఘప్లుతములటంచు
గ్రంథమున నిబద్ధముచేసె గాదె? యట్టి
మమ్ముచంపి తినెదు న్యాయమయ్య నీకు?
"ఆత్మవత్సర్వభూతాని" యనుట వినవె?